
# రోల్ మోడల్

యర్రమిల్లి విజయలక్ష్మి



ఇప్పటివరకూ సంబరంగానే వున్నాడు. తీరా 'ఏరా రెడీనా. టైమవుతోంది. దేవుడికి దణ్ణం పెట్టుకున్నావా. బయల్దేరదామా...' అని తండ్రి అనేసరికి బాబీకి ఎక్కడ లేని దిగులు ఒక్కసారిగా ముంచుకు వచ్చేసింది. 'ఊ...' అన్నాడు బిక్కముఖం వేసుకుని తండ్రికి సమాధానంగా. అలవాటు లేక వదులు వదులుగా ఉండి జారిపోతున్న కొత్త పొడుగు పంట్లాం, చొక్కా మాటిమాటికి పైకి సర్దుకుంటున్నాడు. నూనె పూసి నున్నగా తల దువ్వింది వాడి మమ్మీ. కనుబొమల మధ్య దేవుడి కుంకమ కూడా పెట్టుకున్నాడు. గడ్డం మీద - ముక్కు కింద పై పెదవి మీద - కొమ్మ మీంచి రాలిపడుతున్న పువ్వులా ఉంగరాల వెంట్రుకలు చెదరిపడుతున్న నుదురు మీద ఆవిరి పట్టినట్టు చెమట మెరుస్తోంది. జూన్ నెల పదో తారీఖు వచ్చేసినా ఎండలు మండిపోతూనే ఉన్నాయి. ఉదయం ఏడు గంటలైనా కాకుండానే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు.

'బెల్టు సరిగ్గా పెట్టుకో... అలా అస్తమానూ పాంటు పైకి లాక్కోకూడదు. చేతి గుడ్డ జేబులో ఉందిగా చెమటలు తుడుచుకో.... మమ్మీకి చెప్పావా...' బెల్టు గట్టిగా బిగించి 'ఊ... ఇప్పుడు బాగుంది పద మరి...' అన్నాడు బాబీ అని ముద్దుగా పిలవబడే సురేంద్ర డాడీ రవికుమార్.

'ఏం నాన్నా బాబీ... అన్నీ సర్దుకున్నావుగా... ఏం భయం లేదు... ఆది వారం డాడీ వస్తారు...'

'మరి... నువ్వు?' మమ్మీ కొంగులో ముఖం కప్పుకుని జాలిగా అడిగాడు బాబీ. ఆవిడ వాణ్ని దగ్గరకు తీసుకుని మెత్తగా వెన్ను నిమిరి, 'నేనూ వస్తాను... ఇద్దరం వస్తాం... సరేనా...' అంది లాలనగా. గ్రే కలర్ మీద గులాబీ పూలద్దిన పెద్ద ట్రంకు పెట్టె - పరుపు, బెడ్‌షీట్లు రెండు, తలగడ వుంచి బిగించి కట్టిన హోల్డాలు - పిల్లాడి కోసం చిరుతిళ్లు వుంచిన చిన్న ప్లాస్టిక్ బాస్కెట్టు. అన్నీ ఆటోలో వుంచారు.

'బయల్దేరండి వర్షం రాకుండా...' అంది సుధ. 'మమ్మీ వెళ్ళొస్తా మమ్మీ' అన్నాడు బాబీ ఆటోలో కూర్చుంటూ. 'దిగులు పడకుండా బాగా చదువుకోవాలి. ఫోన్ చేస్తూంటారుగా. రెండ్రోజులు పోతే అంతా అలవాటై పోతుంది' అని సందు చివరి వరకూ వెళ్ళి కదులుతున్న ఆటోకి ఎదురొచ్చింది సుధ. ఆటోలోంచి వెనక్కి, వెనక్కి చూస్తూ కొడుకు టాటా... చెప్తుంటే గేటు ముందు నిలబడి అటే చూస్తూ ఉండిపోయింది.

★ ★ ★

'ఇంకా పిల్లలందరూ రాలేదు. ఒకటి రెండు రోజుల్లో అంతా వచ్చేస్తారు. చాలామంది ఫ్రెండ్సేర్పడతారు. ఇంటికి వెళ్ళాక ఫోను చేస్తాను. ఇదుగో ఈ అరలో పెట్టుకో సామాను. కిటికీ దగ్గర ఉంది. గాలీ వెలుతురూ బాగా వస్తుంది' అని బాబీ సామాన్లు అతనికి కేటాయించిన రెండు అరల్లో సర్దాడు రవికుమార్. 'చూడు... ఎంత పెద్ద హాలో. పన్నెండు మంది పిల్లలు నీకు తోడుంటారు. అందరూ కలిసి హాయిగా చదువుకోవచ్చు' గోడకు ఎత్తి వున్న నవారు మంచం ఫోల్డింగ్ కాట్ పరిచి - దాని మీద పరుపు వేసి తలగడ దుప్పట్లు అమరుస్తుంటే బాబీ తండ్రికి సాయం చేస్తూ 'నేను వేసుకుంటాను డాడీ' అంటున్నాడు.

'వేసుకుందుగానిలే. రేపట్నించి అన్నీ నువ్వే చేసుకోవాలి. జాగ్రత్తగా ఉండాలి. బుక్స్ ఇచ్చాక ఈ అరలో చక్కగా సర్దుకో. అవుటింగ్‌కి వస్తావుగా అప్పుడు అట్టలు వేసి పెడతాను. అన్నీ వినటం అలవాటు చేసుకోవాలి. చాలామంది పిల్లల కోసం చేస్తారు. ఇంట్లో మమ్మీ చేసినట్టుండదు. పెట్టింది తినెయ్యాలి. లేకపోతే నీరసంగా ఉంటుంది. చదువుకోలేవు. తెలిసిందా...?'

'తెలిసింది' అని తల ఊగించాడు. 'అవుటింగ్ ఎప్పుడిస్తారు డాడీ?'

'ఇస్తారులే... ఇప్పుడేగా వచ్చావు' అని ప్రేమగా బుగ్గ నిమిరి 'అబ్బాయి ఇట్రా' అని బిక్కచూపులు చూసుకుంటూ ఆ గదిలో ఒక మూల మునగతీసిన కోడిపిల్లలా కూర్చున్న కుర్రాణ్ని పిలిచి ఊరూ, పేరూ వివరాలన్నీ అడిగి కొడుకుని పరిచయం చేశాడు. వాళ్ళిద్దరూ స్నేహం కలుపుకున్నారు.

'సరే... నేను బయల్దేరుతాను. పొద్దున్న ఫోను చేస్తాలే...'

'మమ్మీని మాట్లాడమంటావా డాడీ...'

'సరే...'

కొడుకుని విద్యా రెసిడెన్షియల్‌లో వదిలి ఇంటికి వచ్చాడు రవికుమార్. అతను తిరిగి వచ్చేవరకూ అన్యమనస్కంగా హాల్లో సోఫాలోనే కూర్చుని ఉంది సుధ. టీవీ ఊరికే సందడి చేస్తోంది కానీ అదేమీ ఆమె మనసు కెక్కటంలేదు.

'వచ్చేశారా...' అంది అతను లోపలికి రాగానే మంచి నీళ్ళు ఇచ్చి. 'ఊ...' అని క్షణం నిస్సత్తువగా సోఫాలో కూలబడి 'ఇంకా పిల్లలంతా రాలేదు. ఎల్లుండిలోగా వచ్చేస్తారు. వీడికో ఫ్రెండు తగిలాడులే...'

'ఎల్లా ఉంది అక్కడ?'

'బాగానే ఉంది. వసతులవీ బాగానే ఉన్నాయి. పెద్ద ఆవరణ అట్మాస్ఫియర్. గాలి, వెలుతురు బాగానే ఉంది. మంచి ప్లేగ్రౌండుంది. అదంతా ముఖ్యం కాదు గదా. కోచింగ్! కోచింగ్ బాగుంటుందని చేర్చాం...' అన్నాడు తన మనసునీ కాస్త కుదుటపరచుకుని. ఇద్దరూ మౌనంగా టీవీలో కదులుతున్న బొమ్మల్ని నిరాసక్తంగా చూస్తున్నారు. ఇద్దరి మనసుల నిండా సురేంద్రే వున్నాడు. 'ఇల్లంతా చిన్నబోయింది. ఒక్కడైనా పదిమంది పెట్టు... వొట్టి అల్లరి వెధవ...' అంది సుధ మనసులోని దిగులు కనపడనీయకుండా చిన్న నవ్వు పూతపూసి.

'ఊ...'

'ఇంతవరకూ ఎప్పుడూ ఒక్కరోజన్నా మన్ని విడిచి వుండలేదు. పిచ్చివెధవ... ఎలా ఉంటాడో ఏమిటో...'

'అదే అలవాటై పోతుంది. తప్పదు. ఏం చేస్తాం. మనకి దగ్గర్లో చిన్న తరగతుల నుంచీ ఐఐటి, ఎంసెట్ ఓరియంటేషన్‌తో కోచింగ్ ఇచ్చే సెంటర్ మరి అదే...'

'అవును' అని అంగీకరించింది. కాని సుధ మనసు పిల్లాడి గురించే ఆలోచిస్తోంది. మరీ 15,16 ఏళ్లుకూడా లేని పసిపిల్లల్ని చదువులకంటూ తల్లిదండ్రుల్ని విడదీసి హాస్టల్స్‌లో ఉంచడం ఆమె తల్లి మనసుకంత నచ్చలేదు. 'ఒక్కగానొక్క పిల్లాడు. ప్రాణాలన్నీ వాడి మీదే ఉంచుకుని ముద్దుగా పెంచుకుంటున్నాం. అమ్మ, నాన్నని విడిచి ఇంతవరకూ ఎక్కడా ఒక్క రోజన్నా ఉండలేదు. ఆ రెసిడెన్షియల్‌లో ఎలా ఉంటాడో? అక్కడ పిల్లాడికి భోజనం అదీ ఎలా ఉంటుందో? కోచింగ్ బాగుంటుందని మంచి పేరుంది. ర్యాంకు హోల్డర్స్‌ని తయారుచేస్తోందని ఆ ప్రాంతంలో చాలామంది పేరెంట్స్ తమ పిల్లల్ని అక్కడే చేరుస్తున్నారు. ఖర్చు ఎక్కువే. ఏడాదికి ముప్పైవేలు. పైన ఇతర ఖర్చులు... వాడు స్కూలు చదువుకు వచ్చిందగ్గర్నుంచి బడ్జెట్ ప్లానింగ్ ప్రారంభించారు. వాడి ఫ్యూచర్ దృష్టిలో వుంచుకుని-ఎడ్యుకేషన్ ఫండొకటి

ఏర్పాటు చేశాడు. 'మనకున్నది ఒక్కడు. వాడికి అరకొర చదువులు చెప్పించి చేతులు దులుపుకోలేం కదా... మన తరువాత రెండు, మూడు తరాలాన్నా నిశ్చింతగా ఉండేలా వీడికి సోషల్ స్టేటస్... ఎకనామికల్ స్టేటస్ వచ్చే 'గట్టి' చదువు చెప్పించాలి. అందుకోసం మన కంఫర్ట్స్ కొన్ని వదులుకోవాలి. మనం సింపుల్‌గా బతికినా వాడు రిచ్‌గా బతకాలి...' ఇద్దరి ఆలోచనలు ఇంచుమించు ఇదే విధంగా సాగేవి. కాని కొడుకుని విడిచి వుండగల గట్టితనాన్ని మాత్రం సమీకరించుకోలేక పోయింది సుధ.

ప్రీ నర్సరీలో ఊళ్లో పేరెన్నికగన్న ఇంగ్లీషు మీడియం కాన్వెంటులో చేర్చిందగ్గర్నుంచీ తల్లి, తండ్రీ వంతులు వేసుకుని 'బాగా చదువుకోవాలి నాన్నా... బాగా చదువుకుని పెద్ద ఇంజనీర్‌ని కావాలి నువ్వు...' అని యధోచితంగా బ్రెయిన్ వాష్ చేస్తూనే ఉన్నారు. పిల్లవాణ్ని అప్పట్నించీ మెంటల్‌గా ప్రిపేరు చెయ్యటం అవసరమని. 'మా రోజుల్లో ఇన్ని అవకాశాలు లేవు. అందుకే డిగ్రీతో సరిపోయింది లేకపోతేనా...' అప్పట్లో ఇంజనీర్ కావాలన్న తన ఆశ ఫలించని నిరుత్సాహం రవికుమార్ మాటల్లో కనిపించేది. అసలు తను కూడా ఇంజనీర్నో, డాక్టర్నో చేసుకోవాలని కలలు కనేది. అంతంత కట్నాలిచ్చుకునే స్తోమత లేక బిఎస్సీ డిగ్రీ తీసుకుని బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ని చేసుకోవాల్సి వచ్చింది. తన రోల్ మోడల్ ఇంజనీర్, డాక్టర్. తమ కొడుకన్నా ఆ కోరిక తీర్చకపోతే ఎట్లా? అందుకే ఏమైతే అయింది లెమ్మని పెద్ద మొత్తం డొనేషన్ కట్టి అదీ పెద్ద రికమండేషన్‌తో ఊళ్లో పెద్దపెద్ద అఫీషియల్స్, బిజినెస్ మాగ్నెట్స్ పిల్లలు చదివే కాన్వెంట్‌లో అబ్బాయికి సీటు సంపాదించారు. టెన్త్ వరకూ ఇక తిరుగు లేదు. చూసుకో అక్కర్లేదు. ప్రైమరీ, సెకండరీ స్థాయి నుంచే మెరిట్ చూపగలిగితే పిల్లాడికి మంచి కెరీర్ ఏర్పడుతుందని నాలుగేళ్ల వయసు నుండీ టైం టేబుల్‌తో కూడిన క్రమశిక్షణ అలవాటు చేశారు. తెల్లవారుజాము నుంచి మెల్లమెల్లగా రాత్రి పదకొండు గంటల వరకూ సాగిన ఈ కాల పట్టికలో స్కూలు, ట్యూషన్, హోంవర్క్, స్టడీ అవర్‌తో పాటు - కంప్యూటర్ శిక్షణ, స్విమ్మింగ్, గేమ్స్ కూడా ఉంటాయి. సుధ తనూ చదువుకున్నదవటం వలన బాబీ చదువు విషయంలో చేదోడుగా వుండేది. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి అకడమిక్ డెవలప్‌మెంట్‌కి మాతోపాటు పేరెంట్స్ సహకారం ఎంతో అవసరం' అన్న డైరెక్టర్‌గారి మాటల్ని తు.చ. తప్పకుండా పాటిస్తూ వాణ్ని ప్రోత్సహిస్తూ, ఉత్సాహపరుస్తూ, ప్రేమగా మందలిస్తూ హెచ్చరిస్తూ వస్తున్నారు.

బాబీకి క్రికెట్ అంటే చాలా ఇష్టం. కాని తొమ్మిదో తరగతి నుంచి మెల్లగా నయానా భయానా నచ్చజెప్పి బాట్, బాల్ మర్చిపోయేట్టు చేశారు. బాబీ కూడా అప్పుడే తన బాధ్యత తెలుసుకున్నట్లే బుద్ధిమంతుడైన బ్రైట్ స్టూడెంట్‌గా తయారవటానికి కృషి చేస్తున్నాడు. ఫలితంగా టెన్త్‌లో ఎనభై శాతం సాధించి భవిష్యత్తుని ఆశాజనకంగా సెట్ చేసుకోగలిగాడు. విద్యలో ఎంట్రన్స్ టెస్ట్ రాసి అబౌ యావరేజ్ స్టూడెంట్‌గా సమోదయ్యాడని, సుధ, రవి ఊపిరి పీల్చుకున్నారు. ఇక వాడి భవిష్యత్‌కి ఒక బాట ఏర్పడినట్లేనని సంతోషపడ్డారు.

ఆ రోజు అందరిచేత వినాయకుడికి పూజ చేయించి కొబ్బరికాయలు కొట్టించి క్లాసులు ప్రారంభించారు. అవుటింగ్ ఎప్పుడు డిక్లేర్ చేస్తారా... ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్లి అమ్మ ఒళ్లో వాలిపోదామని తహతహ లాడుతున్నాడు సురేంద్ర. ప్రతీరోజు మమ్మీ, డాడీ ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నారు. అయినా రాత్రయ్యేసరికి వాడి మనసంతా దిగులుతో నిండిపోతోంది. అమ్మ ఎప్పుడూ తన పక్కనే వుండేది. తను హోంవర్క్ చేస్తున్నా, లెసెన్స్ ప్రిపేరవుతున్నా తన దగ్గరే వుండేది. తను కూడా ఏదన్నా పుస్తకం చదువుకుంటూనో, అల్లిక పని చేసుకుంటూనో తను నిద్రపోయేవరకూ తన దగ్గరే వుండేది. తన పనులన్నీ స్వయంగా తనే చేసేది. అమ్మకి తనంటే ఎంతో ప్రేమ. డాడీ కూడా అంతే. కాసేపు తను కనపడకపోతే 'బాబీ ఏడీ? బాబీ ఏడీ?' అని కంగారు పడిపోతారు.

అక్కడ పిల్లలతో ఏర్పడుతున్న స్నేహం వాడికి బాగానే ఉన్నా తల్లిదండ్రుల మీద ప్రేమని మరిపించలేక పోతోంది. అందరి పిల్లల పరిస్థితీ ఇంచుమించు అట్లాగే ఉంది. అలవాటు పడని పరిసరాలు, ఆహార నియమాలు, క్రమశిక్షణ, అలసట కలిగించే పరిశ్రమ ముఖ్యంగా ప్రియమైన తల్లిదండ్రుల ఎడబాటు ఆ పసి హృదయాలను చెప్పలేని ఆందోళనకు గురి చేస్తోంది. నాలుగ్గంటలకి లేచి చన్నీళ్ళ స్నానం - ఐదు గంటలకి బ్రేక్‌ఫాస్ట్. రోజుకో వెరైటీ టిఫిన్ చేస్తారు.

'మమ్మీ డాడీల ఆలోచనే తన లక్ష్యం. ఈ కాలేజీలో మూడు వందల మంది పిల్లలున్నారు. ఇంచుమించుగా అందరి కోరిక ఒక్కటే. కొందరు లక్ష్యం సాధించవచ్చు. కొందరు సాధించలేక పోవచ్చు కాని రేస్‌లో నిలబడి ఆగిపోవటానికి వీల్లేదు. సర్వశక్తులూ సమీకరించుకుని సత్తువ కొద్దీ పరుగు తియ్యాల్సిందే.'

కానీ ఇడ్లీ ఉడకదు. పిండి పిండిగా, చట్నీ నీళ్లనీళ్లుగా. పూరీ, చపాతీ, పులిహోర, ఉప్మా, బ్రెడ్ ఇలా చాలా... కానీ ఏదో అమ్మ చేసినట్టుండదు. ఎంత ఆకలి మీదున్నా సయించదు. వార్డెన్ వచ్చి అంతా తిన్నారో లేదో చూసి - తినేవరకూ అక్కడే కూచుని తినిపిస్తాడు. ఆరు నుంచి క్లాసులు మళ్ళీ పన్నెండుకి లంచ్. కూర, సాంబారు, పచ్చడి, పెరుగులో ఒక్కోసారి ఈగలు కనిపిస్తాయి. కాలేజీ ఊరుకి బయట ఉంది. బయటకు వెళ్ళటానికి పర్మిషన్ లేదు. అక్కడ మెస్సులో పెట్టింది తిని చదువుకోవటమే పని. సాయంత్రం నాలుగింటికి మళ్ళీ లైట్‌గా బ్రెడ్, బిస్కట్స్, చిన్న స్వీటు, పాలు. 5-7 ప్రిపరేషన్, 7-8 మెస్సు, 8-10 ప్రిపరేషన్ - పది నిమిషాల విశ్రాంతి. తరువాత టెస్టు. రాయలేకపోతే రాత్రంతా అక్కడే వుంచేసి చదివించి - మళ్ళీ టెస్టు రాయించి రూముకి పంపుతారు. డైరెక్టర్ దగ్గర కూర్చుని చదివిస్తాడు. ప్రతి విద్యార్థి మీద ప్రత్యేక శ్రద్ధ ఉంచుతారు.

మొదటిసారి 45 రోజుల తరువాత అవుటింగ్ ఇచ్చారు. కాలేజీలో చేరిన వెంటనే ఇంటికి పంపితే హోం సిక్‌నెస్ పెరుగుతుందని! ఈ మధ్యలో వీలున్నప్పుడల్లా రవికుమార్ అప్పుడప్పుడు సుధ వచ్చి కొడుకుని చూసి వెడుతున్నారు. 'మీరు తరచూ వస్తుంటే వాళ్ళిక్కడ అడ్జస్ట్ కావటం కష్టం. మనసు మీ మీదికి పోతుంది. చదువు తప్ప మరేదీ వాళ్ల మనసులో ప్రవేశించనీయని ఏకాగ్రత అలవాటు కావాలి. మీరు తరచూ వస్తూంటే డిస్టర్బ్ అవుతారు. బయట నుంచి టిఫిన్స్, చిరుతిళ్లు కూడా అనుమతించం...' అనేవారు. అప్పుడప్పుడు వచ్చి వాడికిష్టమైన చాకోబారో, కేకో ఇచ్చి వెళ్ళేవారు. మెల్లమెల్లగా సోలిటరీ కన్‌ఫైన్‌మెంట్ లాంటి రెసిడెన్షియల్ శిక్షణా విధానానికి అలవాటు పడిపోయాడు బాబీ.

మొదటిసారి అవుటింగ్‌కి ఇంటికి వచ్చాడు బాబీ. ఉదయం 11 గంటలకి వదిలారు. రాత్రి 8 గంటలకల్లా అందరూ హాస్టల్లో ఉండాలని చెప్పి. బాబీ ఆనందానికి అంతులేదు. కొత్త బట్టలు వేసుకుని మమ్మీ ప్రేమగా చేసిన తన కిష్టమైనవన్నీ తృప్తిగా తిన్నాడు. ఆ రోజంతా తమ పనులన్నీ పక్కనబెట్టి కొడుకుతోనే గడిపారు సుధ, రవి. కొత్తగా తన చిన్న జీవితంలోకి అడుగుపెట్టిన కొడుకు పసి అనుభవాలు కొన్ని సరదాగాను కొన్ని మనస్సు చివుక్కుమనిపించేలాగానూ ఉన్నవి. వాడు అమాయకంగా చెప్తుంటే శ్రద్ధగా విన్నారు. 'టెస్టు పెట్టారు డాడీ... నాకావేళ చాలా తలనొప్పి వచ్చేసింది. సరిగ్గా రాయలేక పోయాను. డైరెక్టరుగారు రాత్రంతా కాలేజీలో ఉంచేసి మళ్లీ చదివించి రాయించారు.'

'అయ్యో... తల నొప్పెందుకొచ్చిందిరా కన్నా...' అంది సుధ కొడుకు తల నిమురుతూ. 'తలనొప్పి వస్తే వార్డెన్‌కి చెప్తే మందిస్తాడు. అంతేకాని టెస్టు రాయకుండా పనిష్మెంటు తీసుకుంటారా ఎవరన్నా... నువ్వు బాగా చదువుకోవాలి. వాళ్లు పెట్టింది కడుపునిండా తిని - రెస్టు టైంలో విశ్రాంతి తీసుకుంటే తలనొప్పులు... ఒళ్లు నొప్పులు రావు. నువ్వు బాగా చదువుకోవాలి. ఫస్టియరే కదాని అశ్రద్ధ చేయకూడదు. ఎప్పుడూ నువ్వు పనిష్మెంటు తీసుకునే పరిస్థితిలో వుండకూడదు...' తండ్రి మెత్తగానే హెచ్చరించాడు. ఆ రోజు ఈవినింగ్ అనుకున్నట్టు బయల్దేరలేదు సురేంద్ర. అమ్మ, నాన్నతో ఇంకాసేపు గడపాలన్న ఆశతో బస్సు పాస్ చేశాడు.

'బయల్దేరు... బయల్దేరు...' అంటూనే ఉన్నారు మమ్మీ డాడీ. తనే వాళ్ళని వదిలి రాలేక 'నెక్స్ ట బస్సుకెళ్తాను మమ్మీ... ఏమనరు మమ్మీ... కాసేపే...' అని ఇంకో గంట ఇంట్లో గడిపి అక్కడికీ అసంతృప్తిగానే వచ్చాడు. కాలేజ్ టైంలో వారంరోజులు స్టాండింగ్ పనిష్మెంట్ అతని ఆనందాన్ని నీరుగార్చింది. లేత మనసులోని అమాయకత్వానికా సంఘటన ఒక లోతైన గాయమైంది. 'అమ్మ, నాన్న కాస్త ముందే బయల్దేరమన్నారుగా. నేనే వాళ్లని వదిలి రాలేక... ఎప్పుడూ వాళ్ళని వదిలి వుండలేదు. 45 రోజుల తరువాత వెళ్ళాం కదా ఒక్కపూట ఏం సరిపోతుంది' అన్నాడు దిగులుపడుతూ చైతన్యతో.

'ఒరే... సురేన్. ఇంక మనం అవన్నీ ఆలోచించకూడదు. అమ్మ, నాన్న కోసం బెంగపెట్టుకుంటే సరిగ్గా చదువు మీద కాన్‌సన్‌ట్రేట్ చెయ్యలేం. సరిగ్గా చదువుకోకపోతే వాళ్లు బాధపడతారు. మన కోసం ఎంతెంత ఖర్చు పెడుతున్నారు చెప్పు. ఇక్కడా పనిష్మెంట్లు తప్పవు. అన్నీ మర్చిపోయి చదువుకోవాలిరా మనం. మా అమ్మ నాన్న నన్ను డాక్టర్‌గా చెయ్యాలనుకుంటున్నారు. మీ వాళ్లు నిన్ను ఇంజనీర్‌గా చూడాలనుకుంటున్నారు. ఈ రోజుల్లో చాలా మంది మమ్మీ, డాడీలంతే... అలా అయితేనే మనకు మంచి ఫ్యూచర్ ఉంటుందనుకుంటున్నారు. అందుకే మనం ఈ ప్రేమలు, దిగులు, సెంటిమెంట్స్ మర్చిపోవాలి... ఏం?'

పదిహేను సంవత్సరాల వయసులో ఒక కఠినమైన కొత్త పాఠం బాబీ అర్థం చేసుకోగలిగాడు. 'మమ్మీ డాడీల ఆలోచనే తన లక్ష్యం. ఈ కాలేజీలో మూడు వందల మంది పిల్లలున్నారు. ఇంచుమించుగా అందరి కోరిక ఒక్కటే. కొందరు లక్ష్యం సాధించవచ్చు. కొందరు సాధించలేక పోవచ్చు కాని రేస్‌లో నిలబడి ఆగిపోవటానికి వీల్లేదు. సర్వశక్తులూ సమీకరించుకుని సత్తువ కొద్దీ పరుగు తియ్యాల్సిందే. అలసిపోకూడదు... ఆగిపోకూడదు... ఓడిపోకూడదు. మమ్మీ, డాడీ కల నిజం చెయ్యటం కోసమే ఇక తను...!

★